క్లుప్తంగా

కొలతల ప్రకారం ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఏపీఓ రత్నమాల

పూసపాటిరేగ: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలని ఉపాధి ఏపీఓ ఎస్. రత్నమాల అన్నారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు.. మధ్యాహ్నం 4 గంటల నుంచి ఆరు వరకు పనులు చేపట్టాలన్నారు. మండలంలో 8654 మంది వేతనదారులు ప్రస్తుతం పనులు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు సుమతి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార మార్గాలు కనుగొనడమే విజయం ..



మాట్లాడుతున్న విశాఖ గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ మేనేజర్ కేవీవీఎస్ఆర్ చంద్రమౌళి

డెంకాడ: ప్రతి పనిలోనూ సమస్యను గుర్తించి సాంకేతిక అనుసంధానం ద్వారా నూతన పరిష్కార మార్గాలను కనుగొనడం స్టార్టప్‌లకు కీలక విజయ సూత్రమని విశాఖకు చెందిన విశాఖ గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ మేనేజర్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ఆఫీసర్ కేవీవీఎస్ఆర్ చంద్రమౌళి అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంట్రప్రెన్యూర్ డవలప్‌మెంట్, ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెల్ సంయుక్తంగా హౌ టు ప్లాన్ ఫర్ స్టార్టప్, లీగల్ ఎథికల్ స్టెప్స్ అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రమౌళి మాట్లాడుతూ.. నేర్చుకున్న సాంకేతిక విద్యలో మెలకువలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, నిర్వాహకులు పి.తిరుమల, ఏవీ పరాంకుశం, ఈసీఈ విభాగాధిపతి ఎం.రాజన్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పతివాడ పేరెత్తని చంద్రబాబు

- అవమానమంటూ పతివాడ వర్గీయులు

భోగాపురం: 'ఏరు దాటేదాకా ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' అనే సామెత టీడీపీ అధినేత చంద్రబాబుకు సరిగ్గా అతుకుతుంది. దశాబ్దాలుగా టీడీపీకి సేవలందించిన మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడుకు సరైన ప్రాధాన్యం ఇవ్వకుండా పక్కన పెట్టడం ఒకెత్తైతే.. ఆ నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పేరు ప్రస్తావించకపోవడం నియోజకవర్గంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఒకసారి చక్కెర కార్మాగారశాఖ మంత్రిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన పతివాడకు ఘోర అవమానం జరిగిందంటూ ఆయన అభిమానులు మండిపడుతున్నారు. టీడీపీ నాయకులను విస్మరించి జనసేన అభ్యర్థికి టికెట్ కేటాయించాక.. ఈ ప్రాంత టీడీపీ శ్రేణులను చంద్రబాబు విస్మరిస్తున్నారన్న చర్చ జోరందుకుంది. అవసరం ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరొకలా ప్రవర్తించడం చంద్రబాబు నైజమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చివరికి స్థానిక నాయకులు గుర్తుచేయడంతో పవన్ కళ్యాణ్ ఆయన పేరును ప్రస్తావించారే తప్ప చంద్రబాబు పతివాడ పేరును పలికేందుకు ఇష్టపడకపోవడం గమనార్హం.


ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న బిట్రమ్మ తల్లి

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో బిట్రమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.అమ్మవారిని ఉదయం నుంచి గ్రామస్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు అందజేశారు.

నేత్ర వైద్యశిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

జామి: మండలంలోని బలరాంపురం గ్రామంలో భార్గవ్ హెల్ప్‌లైన్ వ్యవస్థాపకుడు కె.వి.రమణ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విజయనగరం వెంకటరామ కంటి ఆస్పత్రి వైద్యసిబ్బంది శిబిరంలో 86 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 22 మందిని శస్త్రచికిత్సలకు, 26 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. భార్గవ్ హెల్ప్ లైన్ సభ్యులు పాల్గొన్నారు.

నిమిషాల్లో సేవలు..

- సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో విప్లవం
- ఇళ్ల వద్దే ప్రభుత్వ సేవలు
- గ్రామాలు, పట్టణాల్లో పరుగులెడుతున్న అభివృద్ధి, సంక్షేమం
- నెల్లిమర్ల నియోజకవర్గంలో ఐదేళ్లలో అందిన సేవలు 3,97,002



సచివాలయం సేవలు అందిస్తున్న సిబ్బంది (ఫైల్)



పూసపాటిరేగ సచివాలయం

పూసపాటిరేగ: గ్రామాలలో సచివాలయాలు ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం పరుగులెడుతున్నాయి. అర్హులైన నిరుపేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు నేరుగా సచివాలయాలకు వెళ్లి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందుతున్నారు. సచివాలయ సిబ్బంది ఎటువంటి రాజకీయ ప్రమేయాలకు లోనుకాకుండా సేవలు అందిస్తుండడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నారు. వలంటీర్ నుంచి సచివాలయం సిబ్బంది, మండల స్థాయిలో ఎంపీడీఓ వరకు అధికారులు జల్లెడపట్టి మరీ పథకాలు మంజూరు చేస్తున్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా, సర్టిఫికెట్లు, ఇతర పనులకు ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు పెట్టేవారు. దీంతో ఎంతో వ్యయ, ప్రయాసలకు లోనయ్యేవారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజల ఇళ్ల వద్దకే పాలన తీసుకురావడంతో ప్రజలకు ఎంతో సమయం, డబ్బులు ఆదా అయ్యాయి. నిమిషాల్లో సర్టిఫికెట్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

మండలం	సచివాలయాలు	2020 నుంచి 2024 ఏప్రిల్ వరకు అందించిన సేవలు
పూసపాటిరేగ	22	1,22,050
డెంకాడ	17	92,869
నెల్లిమర్ల	15	89,654
భోగాపురం	16	92,429

నెల్లిమర్ల నియోజకవర్గ పరిధి పూసపాటిరేగ మండలంలో 1,22,050 సేవలు, నెల్లిమర్లలో 89,654, డెంకాడలో 92, 869, భోగాపురంలో 92,429 సేవలు అందాయి. 2020 జనవరి నుంచి 2024 ఏప్రిల్ నెల నాటికి నియోజకవర్గంలోని 70 సచివాలయాల ద్వారా 3,97,002 సేవలు అందాయి.

జగనన్నకు రుణపడి ఉంటాం



సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. సచివాలయాల ద్వారా ఇంటివద్దనే వలంటీర్ల ద్వారా ఐదేళ్లుగా సేవలు అందుతున్నాయి. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయి.

– షేక్ జరీనా, మహిళ భూడివీధి, పూసపాటిరేగ.

తప్పిన వ్యయప్రయాసలు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాక ముందు ఏ సర్టిఫికెట్ కావాలన్నా వారాల తరబడి మండల కేంద్రంలో తిరగాల్సిన పరిస్థితి ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో ఇంటి దగ్గరే సేవలు అందుతున్నాయి. దీంతో వ్యయప్రయాసలు తప్పాయి. సచివాలయ వ్యవస్థతో ఆంధ్రప్రదేశ్ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచింది.

– తీడ కృష్ణవేణి, డ్వాక్రా మహిళ పూసపాటిరేగ

మలేరియా నివారణలో భాగస్వాములు కావాలి

- డాక్టర్ రాజేష్‌వర్మ



పూసపాటిరేగ: ర్యాలీ నిర్వహిస్తున్న పూసపాటిరేగ పీహెచ్‌సీ సిబ్బంది



భోగాపురం: పోలిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పూసపాటిరేగ: మలేరియా నివారణలో అందరూ భాగస్వాములు కావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా నివారణ దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రతతో మలేరియాను నిర్మూలించగలమన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రమీలాదేవి, సబ్ యూనిట్ అధికారి గోవింద రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సూపర్‌వైజర్లు ఉమాపతి, నానమ్మ, ఆరోగ్య సహాయకులు బంగారుబాబు, ఆర్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పోలిపల్లిలో...

భోగాపురం: మలేరియా నివారణ దినం సందర్భంగా పోలిపల్లిలో పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతి స్వామి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జయకుమారి, ఈఓ ప్రభాకర్, సూపర్‌వైజర్స్ సత్యనారాయణ, అరుణ, సుజాత, ఎంఎల్‌హెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు ప్రకటనలు మానుకోవాలి..

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, ఇది సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జనసేన అభ్యర్థికి మద్దతుగా ఇటీవల నిర్వహించిన సభలో పవన్‌కల్యాణ్ తప్పుడు ఆరోపణలు చేశారన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని వీటీ అగ్రహారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యన్నపేట, దుప్పాడ, రాకోడు, సారిక , కోరుకొండ, ద్వారపూ డి, గుంకలాం, గాజులరేగ, గొల్లవీధి, శాలివీధి, బొబ్బాది పేట, అలకనంద కాలనీ, బొగ్గుల దిబ్బ, ఎల్‌బీ కాలనీ, కాంబోయి వీధి, బ్యాంక్ కాలనీ, సాయి కీర్తన నగర్, కామాక్షి నగర్, సాయిలలితా నగర్, కేఎల్ పురం, కామాక్షి నగర్, కాళీఘాట్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి మద్దతు పలకాలి..

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పక్కన ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు మద్దతు పలకాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు కోరారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 58 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ఎటువంటి అవినీతికి పాల్పడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒక్క జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక ముగ్గురు కలిసి పోటీకి వస్తున్నారని, ఈ విషయాన్న ఓటర్లు గమనించి జగనన్నకు మద్దతివ్వాలని కోరారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో సీఎం జగనన్నను గెలిపించాలన్నారు. రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నాయకులు ఎర్రంనాయుడు, మజ్జి గణేష్, రమణ, గొర్లి రమణ, కనకారావు, అంబళ్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం..

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ గాంధీనగర్ కాలనీలో పార్టీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, నగర అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణీదీప్‌నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంటా సత్యనారాయణ, ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు రేగాన శ్రీనివాసరావు, మద్దిల వాసు, నౌపాడ శ్రీనివాసరావు, జానా ప్రసాద్, కౌన్సిలర్లు జానా సంధ్యారాణి, చిక్కాల సంతోష్‌కుమార్, మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, నాయకులు పైల మురళీ, బూర సత్యనారాయణ, కారుకొండ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సువర్ణపాలన...

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



భోగాపురం: తూడెం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ, ఎమ్మెల్యే తనయుడు ప్రదీప్‌నాయుడు, తదితరులు

భోగాపురం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే సువర్ణ పాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడుతో కలిసి మండలంలోని తూడెం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న అమలు చేసిన పథకాలను వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు ఉప్పాడ, ప్రదీప్‌నాయుడులకు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప్పాడ, ఎమ్మెల్యే తనయుడు ప్రదీప్‌నాయుడు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల అమలుతో దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాశ్, గాలి రాజారెడ్డి, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, దాట్ల శ్రీనివాసరాజు, కుంచం సూరప్పారావు, పట్నా తాతయ్యలు, కిలారి వెంకటరమణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యం



కణపాక ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా గడిచిన ఐదేళ్లలో మెరుగైన పాలన అందించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని 46వ డివిజన్ కణపాక ప్రాంతంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన పెద్ద కుమార్తె డాక్టర్ సంధ్య, అల్లుడు డాక్టర్ నాగాభిషేక్‌లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజయ తిలకాలు దిద్ది హారతులిచ్చారు. ఈ సందర్భంగా కోలగట్ల, తదితరులు మాట్లాడుతూ, త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లును ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మేయర్ వి. విజయలక్ష్మి మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో ఏ ప్రాంతానికి వెళ్లినా కోలగట్ల వీరభద్రస్వామికి ప్రజల బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఐదేళ్లపాటు ఆయన చేసిన సేవలను ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటూ మద్దతు పలుకుతున్నారని చెప్పారు. మరోసారి ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ మాట్లాడుతూ.. తమ డివిజన్ అభివృద్ధికి కోలగట్ల వీరభద్రస్వామి ఎంతగానో కృషి చేశారన్నారు. రెండున్నర కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దూరు లక్ష్మణరావు, దొంతల శ్రీను, పతివాడ నారాయణరావు, తవుడు, కె. రవి, తారకేశ్వరరావు, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న కోలగట్ల కుమార్తె, అల్లుడు

కోలగట్లకు మద్దతుగా..



డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: కోలగట్ల వీరభద్రస్వామి ముమ్మరంగా ఓ వైపు ఎన్నికల ప్రచారం చేస్తుంటే మరోవైపు ఆయన కుమార్తె, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, అల్లుడు ఈశ్వర్‌కౌశిక్ ప్రచారం హోరెత్తిస్తున్నారు. కొత్తపేట ప్రాంతంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావుతో కలిసి కోలగట్ల శ్రావణి.. 29వ డివిజన్‌లో స్థానిక నాయకులతో కలిసి ఈశ్వర్ కౌశిక్ ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు శ్రావణి, కౌశిక్‌లకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో స్వర్ణయుగం..

విజయనగరం: వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో స్వర్ణయుగం నడిచిందని, అటువంటి పాలన కోసం మరోసారి వైఎస్సార్‌సీప అభ్యర్థులను గెలిపించాలని విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 34వ డివిజన్ ఇందిరానగర్ , 16వ డివిజన్ కమ్మవీధి, 11వ డివిజన్ అంబటిసత్రం జంక్షన్, 6వ డివిజన్ జమ్ము ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని కోరారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో రూ.2.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల నిధులతో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలతో పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి బలపర్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి మరింత అభివృద్ధికి నాంది పలకాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బాలి పైడిరాజు, ఆల్తి సత్యకుమారి, గుజ్జల నారాయణరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు మారం బాలబ్రహ్మారెడ్డి, ఆల్తి శ్రీనివాసరావు, సంగంరెడ్డి బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్.. వాస్తవాలు తెలుసుకో

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి



మాట్లాడుతున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సింగవరం బహిరంగ సభలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాజకీయ లబ్ధి కోసం లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నెల్లిమర్ల ఎంపీపీ భూములను ఎమ్మెల్యే దోచేసినట్లు పవన్ కల్యాణ్ నిరాధార ఆరోపణలు చేశారని, ఆయన చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. అసత్య ఆరోపణలు చేసి తనకు రాజకీయ పరిజ్ఞానం లేదని పవన్ మరోసారి నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. నిజాలు తెలుసుకోకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదవడం సరికాదని సూచించారు. నెల్లిమర్లలో అభివృద్ధి లేదని, రహదారులు నిర్మించలేదని చెప్పడం హాస్యాస్పదమని.. గ్రామాల్లో పర్యటిస్తే అభివృద్ధి కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, నాయకులు దురగాశి ఎర్రంనాయుడు, మజ్జి గణేష్, మజ్జి రమణ, గొర్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఈఓ బూసినాయుడు

చీపురుపల్లి: బాలభవన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను వేసవి సెలవుల్లో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎం.బూసినాయుడు కోరారు. పట్టణంలోని బాలభవన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో చిన్నారులు టీవీలు, మొబైల్ ఫోన్లతో కాలం గడపడం ద్వారా ఎన్నో ఇబ్బందులుంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను చిన్నారులు ఉపయోగించుకోవాలని సూచించారు. శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, కీబోర్డు, సంగీతం, అల్లికలు, తదితర విభాగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 వరకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ డాక్టర్ సుంకరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.